నమస్తే తెలంగాణ
# వికారాబాద్
I | హైదరాబాద్, శనివారం 25 మే 2024 | VIKARABAD



సిబ్బందికి సూచనలిస్తున్న రంగారెడ్డి కలెక్టర్ శశాంక

## కౌంటింగ్ సిబ్బందికి మాస్టర్ ట్రైనర్స్‌తో శిక్షణ

రంగారెడ్డి, మే 24(నమస్తే తెలంగాణ) : పార్లమెంటు ఎన్నికల కౌంటింగ్ నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా శుక్రవారం కౌంటింగ్ సిబ్బంది మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కలెక్టర్ శశాంక నేతృత్వంలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని కలెక్టర్ చాంబర్‌లో ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహించారు. రంగారెడ్డి జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని కౌంటింగ్ కేంద్రాల్లో ఎన్నికల విధులు నిర్వర్తించే కౌంటింగ్ సూపర్ వైజర్స్, కౌంటింగ్ అసిస్టెంట్స్, మైక్రో అబ్జర్వర్లను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. జిల్లా పరిధిలోని ఏడు సెగ్మెంట్లకు మొత్తం 777 మంది కౌంటింగ్ సిబ్బందిని నియమిస్తూ ర్యాండమైజేషన్ జరిపారు. వీరిలో కౌంటింగ్ సూపర్ వైజర్స్ 227 మంది ఉండగా, కౌంటింగ్ అసిస్టెంట్స్ 273 మంది, మైక్రో అబ్జర్వర్లు 277 మంది ఉన్నారు. కౌంటింగ్ సిబ్బందికి ఎంపిక చేసిన వివిధ కేంద్రాల్లో మాస్టర్ ట్రైనర్స్‌తో కౌంటింగ్ నిర్వహణపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకొని కౌంటింగ్ విధుల కోసం నియమించబడిన సిబ్బందికి తక్షణమే ఉత్తర్వులనూ అందజేయాలని అధికారులను ఆదేశించారు. ఈ ర్యాండమైజేషన్ ప్రక్రియలో మ్యాన్ పవర్ మేనేజ్‌మెంట్ నోడల్ అధికారి శ్రీలక్ష్మి, ఎన్నికల విభాగం అధికారి సైదులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## సజావుగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు



షాబాద్, మే 24: జిల్లాలో ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు సజావుగా ప్రారంభమైనట్లు సంబంధిత అధికారులు తెలిపారు. శుక్రవారం ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షకు రంగారెడ్డి జిల్లావ్యాప్తంగా మొత్తం 13,886 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 12,472 మంది హాజరయ్యారు. 1,414 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. విద్యార్థులు గంట ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

# లోటు వర్షమే !



- జిల్లాలో కురవని భారీ వర్షాలు
- గత ఏడాది జూన్ మాసం నుంచి ఇదే పరిస్థితి
- చాలా మండలాల్లో సాధారణ వర్షపాతం కంటే తక్కువ నమోదు
- జూన్‌లో కురిసే భారీ వర్షాలపై ఆశలు పెట్టుకున్న జిల్లా రైతాంగం
- వానకాలం సాగు కాస్త ఆలస్యంగా ప్రారంభమయ్యే అవకాశం !

రంగారెడ్డి, మే 24 (నమస్తే తెలంగాణ) : వానకాలం పంటల సాగుకు సన్నద్ధమవుతున్న జిల్లా రైతాంగానికి పరిస్థితులు అనుకూలంగా కనబడడం లేదు. రాష్ట్ర వ్యాప్తంగా భారీగా వర్షాలు కురుస్తున్నప్పటికీ జిల్లాలో ఇప్పటికీ భారీ వానలు పడలేదు. గత ఏడాది జూన్ మాసం నుంచి సైతం అంతంత మాత్రమే వర్షాలు కురిశాయి. ఫలితంగా యాసంగి సాగులో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చింది. ప్రస్తుత మే నెలలోనూ సాధారణ వర్షపాతమే నమోదైంది. దీంతో జూన్‌లో కురిసే భారీ వర్షాలపైనే రైతాంగం ఆశలు పెట్టుకున్నది. ఆతర్వాతే పరిస్థితులను అంచనా వేసుకుని పంటలను సాగు చేసే యోచనలో జిల్లా రైతాంగం ఉంది.

### పంటల సాగుకు రైతులు వెనుకంజ..

ప్రస్తుత వానకాలంలో జిల్లాలో 4.45లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అంచనా వేస్తున్నది. వరి 1,38,187 ఎకరాల్లో, జొన్న 3,361 ఎకరాల్లో, మొక్క జొన్న 66,530 ఎకరాల్లో, పెసర్లు 48 ఎకరాల్లో, కందులు 11,548 ఎకరాల్లో, మినుములు 34 ఎకరాల్లో, వేరు శనగ 550 ఎకరాల్లో, ఆముదం 37 ఎకరాల్లో, మరో 48,959 ఎకరాల్లో వివిధ రకాల పంటలను రైతులు సాగు చేసే అవకాశం ఉన్నది. అత్యధికంగా ఈ సీజన్‌లో పత్తిని 1,76,174 ఎకరాల్లో సాగయ్యే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ చెబుతున్నది. సీజన్‌కు ముందు జిల్లాలో కురుస్తున్న వర్షాలు రైతుల్లో ఆశలను రేకెత్తిస్తున్నాయి. ఇప్పటికే రైతులు పంటల సాగుకు భూములను సిద్ధం చేసి ఉంచారు. విత్తనాలు, ఎరువులను సైతం సమకూర్చుకున్నారు. వర్షాలు కురిస్తే.. విత్తనం వేద్దామని వేచి చూస్తున్నారు. ప్రస్తుతం క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులు రైతులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. అరకొరగా కురుస్తున్న వర్షాలతో రైతులు విత్తనాలు వేయడానికి కొంతమేర వెనుకంజ వేస్తున్నారు.

### ఏడాది పొడవునా సాధారణ వర్షమే..

గత ఏడాది వానకాలం నుంచి నేటి వరకూ జిల్లాలో ఆశించిన స్థాయిలో వర్షాలు పడలేదు. గత ఏడాది జూన్ నెల నుంచి ప్రస్తుత మే నెల వరకు 717.4మి.మీ.ల వర్షపాతం కురువాల్సి ఉండగా.. 719..0మి.మీ.లు మాత్రమే కురిసింది. అంటే 0.2 శాతం మాత్రమే అధిక వర్షం పడింది. ఇక ఈ ఏడాది మార్చి, ఏప్రిల్, మే నెలల్లో 63.0మి.మీ.ల వర్షం మాత్రమే కురిసి 64.6మి.మీ.ల లోటు వర్షపాతం నమోదైంది. జిల్లాలో 6 మండలాల్లోనే సాధారణానికి మించి ఆశించిన మేరలో వర్షాలు పడ్డాయి. 16 మండలాల్లో సాధారణ వర్షపాతమే పడగా.. బాలాపూర్, అబ్దుల్లాపూర్‌మెట్, మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, శంషాబాద్ మండలాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదైంది. అయితే రానున్న రోజుల్లో సమృద్ధిగా వర్షాలు పడుతాయని, రైతులు ఆందోళన చెందవద్దని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ నెలలో ఆశించిన స్థాయిలో వర్షాలు లేనప్పటికీ.. జూన్‌లో అధికంగానే కురుస్తాయని వారు పేర్కొంటున్నారు. అదును చూసి జూన్, జూలై వరకు కూడా విత్తనాలు నాటుకోవచ్చునని వారు సూచిస్తున్నారు.



### బ్లాక్‌లో జోరుగా పత్తి విత్తనాల విక్రయం

- కృత్రిమ కొరతను సృష్టిస్తున్న వ్యాపారులు
- పత్తి విత్తనాల స్టాక్ లేదంటూ బ్లాక్‌లో విక్రయాలు
- ప్రభుత్వ ధర కంటే అధిక ధరకు విక్రయం
- నష్టపోతున్న అన్నదాతలు
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న వ్యవసాయాధికారులు






# కొరత సృష్టిస్తూ.. జేబులు కొల్లగొడుతూ..

వికారాబాద్, మే 24 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో పత్తి విత్తనాల బ్లాక్ దందా జోరుగా సాగుతున్నది. ఓ వైపు నకిలీ విత్తనాలతో రైతులు మోసపోతుండగా, మరోవైపు బ్లాక్‌లో పత్తి విత్తనాల దందా జోరుగా సాగుతుండడంతో అన్నదాతలు తీవ్రంగా నష్టపోతున్నారు. కృత్రిమ కొరత సృష్టించి డిమాండ్‌ను బట్టి బ్లాక్‌లో అధిక ధరకు అమ్ముతున్నట్లు తెలిసింది. జిల్లాలో రేవంత్, ఆధ్య, యూఎస్-7067, సదానంద్ రకాల పత్తి విత్తనాలను అధిక డిమాండ్ ఉన్నది. దీంతో ఆ విత్తనాల కోసం రైతులు డీలర్ల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన దుస్థితి నెలకొన్నది. ఇదే అదునుగా భావించిన ఫర్టిలైజర్ డీలర్లు విత్తనాలు స్టాక్ లేవంటూ బ్లాక్‌లో అధిక ధరలకు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు. ఏ రకం పత్తి విత్తనాలైనా ఒక ప్యాకెట్ ధర రూ.864గా ప్రభుత్వం నిర్ణయించగా.. డీలర్లు బ్లాక్‌లో ఒక్కో ప్యాకెట్‌పై అదనంగా రూ.వెయ్యికిపైగా విక్రయిస్తున్నట్లు తెలిసింది. అధికారులు తనిఖీలు చేసినా ఆధారాలు లభ్యం కాకుండా బిల్లు బుక్‌లో ప్రభుత్వ ధరనే రైతులకు రాసి ఇస్తుండడం గమనార్హం. జిల్లాలో పత్తి విత్తనాల బ్లాక్ దందా జోరుగా సాగుతున్నప్పటికీ జిల్లా వ్యవసాయ యంత్రాంగం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నది. ఫర్టిలైజర్స్ దుకాణాలను తనిఖీలు చేస్తున్న వ్యవసాయాధికారులు కేవలం విత్తనాల స్టాక్ ఎంత వచ్చింది.. ఎంతమేర విక్రయాలు జరిగాయి.. ఇంకా మిగిలి ఉన్న స్టాక్ వివరాలపైనే దృష్టి పెడుతున్నారు తప్ప బ్లాక్‌లో అధిక ధరకు పత్తి విత్తనాల విక్రయాన్ని పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. కొందరు వ్యవసాయాధికారుల ఈ బ్లాక్ దందాపై సమాచారం ఉన్నప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. ఏదేమైనా బ్లాక్ దందాపై కలెక్టర్ దృష్టి పెట్టి రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన ధరకు పత్తి విత్తనాలు అందేలా చర్యలు చేపట్టి న్యాయం చేయాలని కోరుతున్నారు.

> **అధిక ధరకు విక్రయిస్తే చర్యలు..**
>
> అధిక ధరకు పత్తి విత్తనాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. జిల్లాలోని అన్ని ఫర్టిలైజర్స్ దుకాణాల్లో ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తున్నాం. రైతులు విత్తనాలు తీసుకున్నప్పుడు తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలి. గుర్తింపు పొందిన డీలర్ల వద్దనే విత్తనాలను కొనుగోలు చేయాలి. ఈ నెల 27 నుంచి గ్రామాల వారీగా రైతులకు ఏఈవోలు అవగాహన కల్పిస్తారు. అదేవిధంగా ఏ రకం విత్తనాలతో సాగు చేసిన దిగుబడి ఒకే రకంగా వస్తుంది. కొన్ని పత్తి విత్తనాల రకాలపై జరుగుతున్న ప్రచారాన్ని నమ్మొద్దు.
>
> – గోపాల్, జిల్లా వ్యవసాయాధికారి

### నకిలీ పత్తి విత్తనాల దందా...

ఏటా పత్తి రైతులు నకిలీ విత్తనాలతో మోసపోతున్నారు. జిల్లా వ్యవసాయాధికారులు, పోలీసులు తనిఖీలు చేస్తున్నప్పటికీ నకిలీ విత్తనాల దందా మాత్రం ఆగడం లేదు. నకిలీ విత్తనాలతో సాగు చేసి మోసపోయామని తెలిసేలోగా అదును దాటి మళ్లీ విత్తనాలు నాటే పరిస్థితి లేకుండా పోతున్నది. జిల్లాలో ఇప్పటివరకు నకిలీ విత్తనాలకు సంబంధించి మూడు కేసులు నమోదయ్యాయి. వ్యవసాయ, పోలీసు శాఖల ఆధ్వర్యంలో దాడులు చేసి కొడంగల్, యాలాల, దౌల్తాబాద్ మండలాల్లో రూ.39 లక్షల విలువ చేసే 23 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. గతేడాది నకిలీ విత్తనాలకు సంబంధించి మూడు కేసులు నమోదుకాగా, రూ.14.77 లక్షల విలువ చేసే 11.45 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలను, 2022-23లో నకిలీ పత్తి విత్తనాలకు సంబంధించి 8 కేసులు నమోదుకాగా, రూ.35.28 కోట్ల విలువ చేసే 27.98 క్వింటాళ్ల విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. మరోవైపు రైతాంగం నకిలీ విత్తనాల బారిన పడకుండా జిల్లా వ్యవసాయ శాఖ పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నది. లైసెన్స్ పొందిన డీలర్ల వద్దనే రైతులు పత్తి విత్తనాలను కొనుగోలు చేయాలని సూచిస్తున్నారు. కొందరు వ్యక్తులు గ్రామాల్లో హెచ్‌టీ పత్తి విత్తనాలను విక్రయించేందుకు ప్రయత్నిస్తుండడంపై వ్యవసాయ శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించినా.. గుట్టుచప్పుడు కాకుండా దందా సాగుతున్నదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

## హెచ్‌ఎండీఏ కార్యాలయాలు..
# పైగా ప్యాలెస్‌కు

> ఆగస్టు నాటికి తరలించాలని డెడ్ లైన్
>
> తక్కువ స్థలంలో కార్యాలయాల కూర్పు.. కష్టమంటున్న ఉద్యోగులు
>
> 'స్వర్ణజయంతి'లోకి అద్దెకొచ్చేవారు కరువు
>
> ఇప్పటికే కాంప్లెక్సు భవనంలో 20-25 శాతం ఖాళీగానే

సిటీబ్యూరో, మే 24 (నమస్తే తెలంగాణ): జీహెచ్‌ఎంసీ తర్వాత అత్యంత ప్రాధాన్యత కలిగిన శాఖ హెచ్‌ఎండీఏ. హైదరాబాద్ చుట్టూ 7 జిల్లాల పరిధిలో సుమారు 50 కి.మీ దూరం వరకు విస్తరించిన హెచ్‌ఎండీఏ పరిధిలో పట్టణీకరణతో పాటు పరిశ్రమలు గణనీయంగా పెరుగుతున్నాయి. ముఖ్యంగా కొత్తగా నిర్మించే రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్) వరకు హెచ్‌ఎండీఏ పరిధిని విస్తరిస్తున్నట్లు ప్రకటించారు. ఈ నేపథ్యంలో పెద్ద మొత్తంలో ఉద్యోగులు, వివిధ విభాగాలకు ఇప్పుడున్న దానికంటే ఎక్కువ మొత్తంలో ఆఫీసు స్థలం అవసరం ఉంటుంది. అయితే ప్రస్తుతం అమీర్‌పేటలోని స్వర్ణ జయంతి కమర్షియల్ కాంప్లెక్సులో ఉన్న హెచ్‌ఎండీఏ ప్రధాన కార్యాలయంతో పాటు హుస్సేన్‌సాగర్ తీరంలో ఉన్న బుద్ధపూర్ణిమ ప్రాజెక్టు కార్యాలయం, అదేవిధంగా నానక్‌రాంగూడలో ఉన్న హైదరాబాద్ గ్రోత్ కారిడాల్ లిమిటెడ్ (హెచ్‌జీసీఎల్), అర్బన్ ఫారెస్ట్ కార్యాలయాలను అన్నింటినీ కలిపి బేగంపేటలోని పైగా ప్యాలెస్‌లోకి తరలించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఆగస్టు నాటికల్లా తరలింపు ప్రక్రియను పూర్తి చేయాలని డెడ్‌లైన్ కూడా పెట్టింది. దీంతో అధికారులు ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా హెచ్‌ఎండీఏ కార్యాలయాల తరలింపు ప్రక్రియను మొదలు పెట్టారు. అయితే హెచ్‌ఎండీఏ కార్యాలయాలన్నింటినీ పైగా ప్యాలెస్‌కు తరలించాలన్న నిర్ణయంపై ఉద్యోగులు అయిష్టత చూపుతున్నట్లు సమాచారం. అక్కడ స్థలం ఏ మాత్రం సరిపోదని..తక్కువ స్థలంలో కార్యాలయాల కూర్పు కష్టసాధ్యమని, ఇప్పుడున్న చోటే ఎంతో బాగుందని, ఎక్కడ ఉండాల్సిన కార్యాలయాలు..అక్కడ ఉంటేనే బాగుంటాయన్న అభిప్రాయం ఉద్యోగుల వర్గాల్లో వ్యక్తమవుతున్నట్లు తెలిసింది.

### 2008 దాకా హుడా కార్యాలయం..

కోర్ సిటీలోని బేగంపేటలో 2007 వరకు పైగా ప్యాలెస్ భవనంలో అప్పటి హుడా (హైదరాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) కార్యాలయం కొనసాగింది. ఆ తర్వాత 2008 నుంచి హుడా కాస్తా హెచ్‌ఎండీఏ (హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ)గా అవతరించింది. తార్నాకలోని సొంత భవనంలో సుమారు 13 ఏండ్ల పాటు కొనసాగిన హెచ్‌ఎండీఏ కార్యాలయం రెండేండ్ల నుంచి అమీర్‌పేటలో సొంత భవనమైన స్వర్ణ జయంతి కాంప్లెక్సులో కొనసాగుతున్నది. ఈ కార్యాలయం ఆధునీకరణ కోసం సుమారు రూ.10 కోట్ల దాకా వెచ్చించి అత్యంత అధునాతన, విశాలమైన ఆఫీస్ ప్రాంగణాన్ని హెచ్‌ఎండీఏ కార్యకలాపాలకు సిద్ధం చేసింది. మొత్తం 5 అంతస్తుల్లో హెచ్‌ఎండీఏకు చెందిన వివిధ విభాగాలు ఉన్నాయి. ఇవే కాకుండా మరో రెండు చోట్ల హెచ్‌ఎండీఏకు సంబంధించిన కార్యాలయాలు ఉన్నాయి. వాటిలో ఒకటి హుస్సేన్‌సాగర్ తీరంలోని లుంబినీ పార్కు వద్ద బుద్ధ పూర్ణిమ ప్రాజెక్టు అథారిటీ(బీపీపీఏ), ఔటర్ రింగ్ రోడ్డు ప్రాజెక్టుకు సంబంధించిన హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ (హెచ్‌జీసీఎల్), అర్బన్ ఫారెస్ట్ కార్యాలయాలు నానక్‌రాంగూడలోని ఓఆర్‌ఆర్ ఇంటర్‌చేంజ్ సర్కిల్‌లో ఉన్నాయి. వీటన్నింటినీ ఒకే చోటైన బేగంపేట పైగా ప్యాలెస్‌కు తరలించాలన్న నిర్ణయం పట్ల హెచ్‌ఎండీఏ ఉద్యోగులే.. సరైన నిర్ణయం కాదంటూ పేర్కొంటున్న పరిస్థితి నెలకొన్నది.



### స్థలభావమే అసలు సమస్య...

బేగంపేటలోని పైగా ప్యాలెస్‌కు ఎంతో చారిత్రాత్మక నేపథ్యం ఉంది. ఈ భవనంలోనే గతంలో హుడా కార్యాలయం ఉండేది. ప్రస్తుతం హుడా పరిధి పెరిగి హెచ్‌ఎండీఏగా మారడంతో వందలాది మంది ఉద్యోగులు, వివిధ విభాగాలు కొత్తగా వచ్చాయి. అలాంటప్పుడు తక్కువ భవన నిర్మాణ స్థలం ఉన్న పైగా ప్యాలెస్‌లో అన్ని విభాగాలకు అనుకూలంగా ప్రత్యేక చాంబర్లు, ఉద్యోగుల కోసం క్యాబిన్లు ఏర్పాటు చేయాలంటే స్థలం సరిపోదనే అభిప్రాయాన్ని హెచ్‌ఎండీఏ ఇంజినీరింగ్ విభాగం అధికారులు వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే అమీర్‌పేటలోని స్వర్ణ జయంతి కమర్షియల్ కాంప్లెక్సులో హెచ్‌ఎండీఏ కార్యాలయాల కోసం ఒకేసారి రూ.10 కోట్ల దాకా వెచ్చించి రెండేండ్ల కిందటే ఆధునీకరించారు. అలాంటి కార్యాలయాన్ని మళ్లీ తరలిస్తే రూ.10 కోట్లు వెచ్చించిన కార్యాలయం ఫర్నిచర్, ఇంటీరియర్ అంతా వృథా అవుతుంది. మరోవైపు స్వర్ణజయంతి కమర్షియల్ కాంప్లెక్సులోకి ప్రైవేటు సంస్థలు అద్దెకు రావడానికి ఆసక్తి చూపడం లేదు. ఇప్పటికే 8 అంతస్తులుగా ఉన్న భవనంలో 20-25 శాతం ఖాళీగానే ఉంది. ఈ నేపథ్యంలో ఇక్కడి నుంచి హెచ్‌ఎండీఏ కార్యాలయాన్ని పైగా ప్యాలెస్‌కు తరలిస్తే.. అద్దెకు వచ్చే వారు తక్కువగా ఉన్నారని, అదే విధంగా రూ.10 కోట్ల దాకా వెచ్చించి చేపట్టిన ఇంటీరియల్ డిజైన్స్, అధికారుల చాంబర్స్ అన్ని తొలగించాల్సి ఉంటుందని చెబుతున్నారు. అదే సమయంలో పైగా ప్యాలెస్‌లో కొత్తగా మళ్లీ ఉన్నతాధికారుల చాంబర్లు, క్యాబిన్‌లు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. దీనివల్ల అదనంగా కోట్లలోనే మరోసారి ఖర్చు చేయాల్సి ఉంటుందనే అభిప్రాయాన్ని ఉద్యోగులు వ్యక్తం చేస్తున్నారు. హెచ్‌ఎండీఏ పరిధిలోని ఆర్‌ఆర్‌ఆర్ వరకు విస్తరిస్తామని ప్రకటించిన ప్రభుత్వం భవిష్యత్ అవసరాలు, వివిధ విభాగాల విస్తరణ కార్యకలాపాలు పెరిగితే బేగంపేటలోని పైగా ప్యాలెస్ భవనంలోని స్థలం ఏమాత్రం సరిపోదని, ఇప్పటికైనా సర్కారు పునరాలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉందనే అభిప్రాయం ఉద్యోగ వర్గాల్లో వ్యక్తమవుతున్నది.

## విలేకరులు కావలెను

### నమస్తే తెలంగాణ

నమస్తే తెలంగాణ దినపత్రిక
హైదరాబాద్, రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్
జిల్లాల్లో ఈ క్రింది ప్రాంతాల్లో పనిచేసేందుకు పార్ట్‌టైమ్ విలేకరులు కావలెను.

**గ్రేటర్ హైదరాబాద్**

1. గాజుల రామారం
2. గాంధీ ఆస్పత్రి
3. కూకట్‌పల్లి
4. రసూల్‌పుర
5. ఘట్‌కేసర్ రూరల్
6. సంతోష్‌నగర్
7. మహేశ్వరం
8. పహాడీషరీఫ్
9. చాంద్రాయణగుట్ట
10. గౌతమ్‌నగర్
11. అల్వాల్

**రంగారెడ్డి**

1. శంకర్‌పల్లి
2. కేశంపేట
3. కొందుర్గు
4. చౌదరిగూడ

**వికారాబాద్**

1. తాండూర్ టౌన్
2. వికారాబాద్ రూరల్
3. బంట్వారం
4. కోట్‌పల్లి
5. మోమిన్‌పేట

పరీక్ష తేది : మే 28 (2024) మంగళవారం
సమయం: మధ్యాహ్నం 2 గంటలకు
పరీక్షా కేంద్రం : నమస్తే తెలంగాణ ప్రధాన కార్యాలయం
బంజారాహిల్స్ - హైదరాబాద్